క్లుప్తంగా

గర్భిణులు వైద్యపరీక్షలు చేసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జయకుమార్

పాలసముద్రం: మండలంలోని గర్భిణులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేసుకుంటేనే మాతా శిశు మరణాలు జరగవని వైద్యాధికారులు జయకుమార్, మోహన్‌క్రిష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతోపాటు మజ్జిగ, పండ్ల రసం, ఆకుకూరలు, ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. 38 మంది గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

నేడు పేరెంట్.. టీచర్ సమావేశం

నగరి: మండలంలో గురువారం మెగా పేరెంట్.. టీచర్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు పీఎస్ శ్రీదేవి, బి.నమశ్శివాయ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: విద్యార్థులు టెక్నాలజీతోపాటు ఉద్యోగ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. బుధవారం చవటగుంటలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వన్ మిలియన్, వన్ బిలియన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ అవసరాలు, భవిష్యత్ అవకాశాల గురించి విద్యార్థులు ఆలోచించాలన్నారు. విద్యార్థులు వివిధ రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ స్కిల్స్, లీడర్‌షిప్ తదితర నైపుణ్యాలను తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. అనంతరం డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మున్వర్, శంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వంతో ముందుకు..



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ మనోహర్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు పోటీతత్వంతో ముందుకు సాగాలని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఆ కళాశాలలో జాన జాగృతి సంస్థ విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుల్లో రాణించడంతోపాటు ఇతర అంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు మాట్లాడుతూ, దేశంలో జనగణన, కులగణనను ప్రారంభించేందుకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సామాజిక మార్పులకు కుల వివరాలు దిక్సూచిలా ఉపయుక్తమవుతాయన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు తిరుకుమరన్, నాయకులు రెడ్డిమస్తాన్, సునీల్ కుమార్, హేమంత్ చౌదరి, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

తొట్టంబేడు: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని 3ఎఫ్ ఆయిల్‌ఫామ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ విజయప్రసాద్, జోనల్ మేనేజర్ వెంకట మురళి అన్నారు. తొట్టంబేడు మండలం శివనాథపురంలో 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేటు లిమిటెడ్ వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు స్థిర ఆదాయం ఉంటుందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం కూడా చేయూతనందిస్తోందని తెలిపారు. పామాయిల్ వాణిజ్య పంటగా రైతులకు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందిస్తుందన్నారు. పామాయిల్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. మండలంలో తొలిసారి పామాయిల్ సాగు చేసిన విజయశ్రీ మాట్లాడుతూ తాను గతంలో వేరే పంటలు వేసి నష్టపోయానని పామాయిల్ సాగుపై అవగాహన పెంచుకుని ఈ ఏడాది సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పంట సాగులో ఎలాంటి సమస్యలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజామాణిక్యం, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌నాయుడు, ఉద్యానశాఖ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లే తొలి గురువు

- మంచి, చెడు స్పర్శలపై ఆడబిడ్డలకు అవగాహన అవసరం
- దీనిపై చిన్నారులను చైతన్యవంతం చేయాలి
- బాలికలపై అఘాయిత్యాలను అరికట్టాలి



బ్యాడ్ టచ్, గుడ్ టచ్ చిత్రం

అభం శుభం తెలియని చిన్నారులపై సాగుతున్న అఘాయిత్యాలను మనం రోజూ పత్రికల్లో చదువుతున్నాం. మీడియాలో చూస్తున్నాం. ఇటీవల కాలంలో పిల్లల కిడ్నాప్‌లు..వారిపై వేధింపులు..లైంగిక దాడులు అధిక కావడం గమనిస్తున్నాం. ఇలాంటి తరుణంలో ఆడబిడ్డలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించాలి. ఈ మేరకు పిల్లలతో తరచూ మాట్లాడి చైతన్యవంతం చేయాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలి.

విజయపురం: ఇప్పటికీ మన సమాజంలో చాలా మంది కొన్ని శరీర భాగాలను బాహాటంగా చెప్పేందుకు సిగ్గు పడుతుంటారు. మరికొందరు వాటిని యథేచ్ఛగా ఉచ్చరిస్తుంటారు. ఇవి రెండూ తప్పేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రతి శరీర భాగానికి సరైన పదాలను ఉపయోగించాలి. సిగ్గుపడకుండా ముట్టుకోని భాగంలో ఎవరైనా టచ్ చేస్తే వెంటనే తల్లిదండ్రులకు వచ్చి చెప్పాలని వివరించాలి. ఇలాంటి విషయాలను పిల్లలకు చెబితే అవి వారిని భయపెడతాయని అక్కడితో ఆపేయకూడదు. వారేదైనా చెప్పడానికి వస్తే చెప్పనివ్వాలి. ఇవన్నీ ఆడపిల్లలకే గాకుండా ఇంట్లోని మగపిల్లలకు కూడా వివరించి చెప్పాలి. ఆడబిడ్డలతో ఎలా ప్రవర్తించాలి, ఎలా మాట్లాడాలి, ఎలా వ్యవహరించాలో తెలియజేయాలి. ఇలాంటి విషయాలన్నీ పిల్లలకు బలవంతంగా కాకుండా ప్రేమతో సున్నితంగా నేర్పించేందుకు ప్రయత్నించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మంచీచెడు వివరించాలి

ఇంట్లోని పిల్లలకు ఏది మంచో... ఏది చెడో చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. సమాజంలో ఎవరిని నమ్మాలో... ఎవరిని నమ్మకూడదో, ఎవరు ఎలాంటి వారో, నమ్మితే వారేం చేస్తారో కూడా వారికి వివరించి చెప్పాలి. అంతేకాదు స్నేహితులైనా. సన్నిహితులైనా, బంధువులైనా ఎవరిని దగ్గరకు రానీయకూడదో.. ఎవరు ఎక్కడ తాకకూడదో కూడా వారికి సవివరంగా విడమరచి తెలపాలి ఎక్కడైనా, ఏదైనా జరిగితే ఎలాంటి విషయాలైనా వెంటనే తల్లిదండ్రులకు వచ్చి చెప్పాలని కూడా వారికి వివరించాలి. తరచూ వారికి వచ్చే సందేహాలను తీర్చే బాధ్యత కూడా తల్లిదండ్రులపైనే ఉంటుంది, ఇందుకోసం. తల్లిదండ్రులు సైతం విద్యావంతులు కావాలి. అవసరమైతే చదువుకున్న వారిని కలిసి చర్చించాలి. ఇందుకు ఉపయోగపడే పుస్తకాలను చదవి జ్ఞానం సంపాదించుకోవాలి. పిల్లలు స్కూల్లో ఎలా ప్రవర్తిస్తున్నారో తరచూ వెళ్లి ఉపాధ్యాయులను కలిసి తెలుసుకోవాలి.

ఇలా కూడా చెప్పొచ్చు..

- మీ పిల్లలు ఆడుకునే బొమ్మల్ని ఉపయోగించి ఏది గుడ్ టచ్, ఏది బ్యాడ్ టచో వివరించండి.
- తాకకూడదని ప్రదేశాలను ఎవరైనా ముట్టుకునే ప్రయత్నం చేస్తే ఆ వ్యక్తి మంచి వాడు కాదని, హాని చేసే అవకాశం ఉందని అర్థమయ్యే రీతిలో చెప్పాలి.
- ఇలా ముట్టుకునే వ్యక్తి వద్ద ఒక క్షణం కూడా ఉండకుండా వెంటనే ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పాలని వివరించాలి.
- మా ఇంట్లో ఆడుకుందువు రా.. బోలెడు బొమ్మలున్నాయి నీకు ఇస్తాను రమ్మంటే వెళ్లకూడదని చెప్పాలి.
- చిన్న కథల రూపంలో కూడా పిల్లలకు మంచి, చెడు టచ్‌పై అర్థం అయ్యేలా తెలియజేయాలి.

బాలికలు, బాలింతలకు చెబుతున్నాం

మా ప్రోగ్రామ్‌లో భాగంగా బాలికలు, బాలింతలకు అన్ని విషయాలు సవివరంగా చెబుతున్నాం. ఇదే సమయంలో వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి కూడా వెల్లడిస్తున్నాం. ఇలాంటి విషయాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా పిల్లలకు చెబుతుండాలి. అప్పుడే సమాజంలో చిన్నారులపై అఘాయిత్యాలను అరికట్టవచ్చు.

–ఇందిరా ప్రియదర్శిని, సీడీపీఓ, నగరి

ఉపాధ్యాయులపై పనిభారం

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉపాధ్యాయులపై పనిభారం పెంచి, మానసిక ఒత్తిడికి గురి చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వారు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభంలోనే యోగా కార్యక్రమం నిర్వహించి సుమారు 10 రోజులపైనా ఉపాధ్యాయులపై పని భారం పెంచిందని, ప్రస్తుతం మెగా పేరెంట్స్ డే నిర్వహించి, గిన్నిస్ రికార్డు కోసం క్షణ క్షణానికి ఒక జీఓ ఇస్తూ ఉపాధ్యాయులను భయకంపితులు చేస్తుందని ఆరోపించారు. అరకొరా నిధులతో హంగామా, ఆర్భాటాలు చేయమని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం భావ్యం కాదన్నారు. అరకొరగా నిధులు మంజూరు చేసి, విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు బహుమతులు అందించాలని, అందులోనే షామియానా, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని, పాఠశాలను రంగు కాగితాలతో అలంకరించాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు భోజనాలు వడ్డించాలని ఆదేశాల జారీ చేయడం సమంజసం కాదన్నారు.

అన్నదానం

గంగాధర నెల్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బుధవారం ఎంపీ కేశవ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంపీ శ్రీధర్ రెడ్డి సహకారంతో అన్నదానం చేశారు. హాస్పిటల్ వచ్చే గర్భిణులు రోగులు ఆకలితో ఉండకూడదని ఉద్దేశంతో రెడ్‌క్రాస్ మండల ప్రెసిడెంట్ పాపిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి సర్వం సిద్ధం




ప్రత్యేక అలంకరణలో సాయిబాబా, ఆలయంలో క్యూలైన్లు

- ముస్తాబైన షిరిడీ సాయిబాబా ఆలయం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

పుత్తూరు: పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మందిరాన్ని వివిధ పుష్పాలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. గురు పౌర్ణమి రోజున బాబా మూలమూర్తికి భక్తులు తమ స్వహస్తాలతో పాలాభిషేకం చేసే అవకాశం కల్పిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం నిర్వహించనున్న క్షీరాభిషేకానికి పోటెత్తే భక్తులను నియంత్రించేందుకు నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

విశేష కార్యక్రమాలు

సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గురువారం వేకువజామున 2.30 గంటలకు సుప్రభాత సేవ, 3.30కి కాగడ హారతి, 4కి బాబాకు మంగళ స్నానం, విష్ణుసహస్రనామార్చన నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 4.30 గంటల నుంచి భక్తుల స్వహస్తాలతో బాబాకు పాలాభిషేకం మొదలుపెడతారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వితరణ జరిపించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతి సమర్పించనున్నారు. అనంతరం భాజాభజంత్రీలు, కోలాటాలు, భజనల నడుమ పురవీధుల్లో బాబా ఊరేగింపు నిర్వహించనున్నారు. రాత్రి 8.30 గంటలకు పవళింపు హారతి చేపట్టనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయనున్నారు.

‘పచ్చిరొట్ట’కు ఇదే అదును



కృష్ణారామాపురం వద్ద పచ్చిరొట్ట పంట సాగు

నగరి: అడపాదడపా వర్షం కురుస్తూ.. ఎండ సైతం కాస్తున్న ప్రస్తుత వాతావరణం పచ్చిరొట్ట పంటల సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయాధికారి రాఘవేంద్రయాదవ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భూసారం పెంపొందించేందుకు పచ్చిరొట్ట పంటలు ఉపయోగపడతాయని వెల్లడించారు. ఈక్రమంలో రైతులు విరివిగా పచ్చిరొట్ట సాగు చేపట్టాలని సూచించారు.

కేంద్ర బృందం పర్యటన



క్రిష్ణజమ్మాపురంలో కేంద్ర బృందం

గుడిపాల: మండలంలోని క్రిష్ణజమ్మాపురంలో బుధవారం కేంద్ర బృందం పర్యటించింది. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, తడిచెత్త–పొడిచెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును కేంద్ర బృందం సభ్యులు దామోదరం, రాజేష్ పర్యటించారు. కంపోస్ట్ తయారీ, మరుగుదొడ్ల వినియోగం గురించి కుటుంబాలతో ఆరా తీశారు. అంగన్‌వాడీ, పీహెచ్‌సీ, పాఠశాలల్లో మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లలో పారిశుద్ధ్య నిర్వహణ గురించి సర్వే చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంపూర్ణ, ఎస్‌డబ్ల్యూఎం కన్సల్టెంట్ బాలసుందరం, ఎస్‌బీఎం ఎంఆర్‌సీ రాజ్‌కుమార్, కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15న పెన్షనర్ల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 న కలెక్టరేట్ ఎదుట ఉదయం 11 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వాలిడేషన్ అమెండ్‌మెంట్‌ను, పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాలను నిలిపివేయాలన్నారు. 8వ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

రేణిగుంట:సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రూరల్ సీఐ మంజునాథ రెడ్డి అన్నారు. మండలంలోని కేఆర్సీ కాలేజ్‌లో విద్యార్థులకు బుధవారం రూరల్ సీఐ మంజునాథ రెడ్డి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు కీ, ఓటీపీ, పాన్, ఆధార్ వివరాలు చెప్పకూడదని సూచించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొరవడిన పర్యవేక్షణ..లబ్ధిదారులకు ఇక్కట్లు



నరసింహాపురం చౌక దుకాణం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

పాలసముద్రం: చౌక దుకాణాలపై అధికారులు పర్యవేక్షణ కొరవడింది. దీంతో డీలర్‌లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి 8 గంటల వరకు సరుకులను లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉంది. చౌక దుకాణాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. అయితే మండలంలో ఒక రేషన్ షాపులోనూ తాగునీటి వసతి లేదు. డీలర్‌లు సమయపాలన పాటించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఎప్పుడు దుకాణాలు తెరుస్తారో తెలియడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రేషన్ బండి ఇంటికి వచ్చి రేషన్ ఇచ్చేదని, ప్రస్తుతం రేషన్ షాప్ దగ్గరకి వెళ్లినా డీలర్ ఉంటారో? లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. సరుకుల పంపిణీ సమయంలో తూకాల్లో తేడాలు వస్తున్నాయని లబ్ధిదారులు అడిగితే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మీకు ఈ దుకాణంలో పేరు లేదని, రేషన్ ఇవ్వమని చెబుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులకు డీలర్లు ఇంటి వదకే రేషన్ సరుకులు అందించాలని చెప్పినా డీలర్లు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి చౌకదుకాణలను తనిఖీలు చేసి, వ్యవస్థను గాడిలో పెట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ రిశివర్మను వివరణ కోరగా అటువంటి రేషన్ దుకాణాలను గుర్తించి, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులకు రేషన్ అందేలా రేషన్ డీలర్లతో మాట్లాడుతామని తెలిపారు.

ప్రభుత్వాల వైఖరిపై పోరాటం



నగరిలో కార్మికుల మానవహారం

నగరి: దేశ సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరిని నిరసిస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్తంగా నగరి టవర్ క్లాక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు.ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు కోదండయ్య, పెరుమాళ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించక పోవడం, నిత్యావసర ధరలను అదుపు చేయలేక పోవడం పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలను అడ్డు, అదుపు లేకుండా పెంచుకుంటూ పోతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు షణ్ముగం, వేలన్, మురళి, భాష, శేఖర్, సుబ్రమణ్యం, రాజేంద్ర, చినరాసు, సతీష్, చందామర్రై, విజయ లక్ష్మి, దనకోటి, శాంతి, మునెమ్మ పాల్గొన్నారు.



పుత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల సభ్యులు

కనీస వేతనం చెల్లించాలి

పుత్తూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలంటూ పలు కార్మిక సంఘాలు కదం తొక్కాయి. ఈ సందర్భంగా పుత్తూరు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు మునికుమారి మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ముఖ్యమంత్రి, మంత్రులకు వినతిపత్రాలు సమర్పిస్తే ఇప్పటి వరకు సానుకూలంగా స్పందించలేదని మండిపడ్డారు. వేతనాలు పెంచకపోగా వివిధ యాప్‌ల ద్వారా పనిభారం పెంచారని ఆరోపించారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



నిరసన తెలుపుతున్న ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు

కార్వేటినగరం: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్వేటినగరం ప్రాజెక్టు అధ్యక్షురాలు విజయ డిమాండ్ చేశారు. బుధవారం కార్వేటినగరం ఐసీడీఎస్ పరిధిలోని వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లను నెరవేర్చాలని మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఐసీడీఎస్ బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే సిబ్బందికి కనీసం వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ జీఓ నంబర్ 8ని మార్పు చేయాలన్నారు. పెన్షన్‌తో పాటు, పీఎఫ్, ఐఎస్‌ఐ అమలు చేయాలని కోరారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేసే వేసవి సెలవులను అంగన్‌వాడీలకు వర్తింపజేయాలని, కార్మికులను ఇబ్బంది పెట్టే కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మమత, నాయకులు తేజు, జీవ, మంజుల, కుమారి, సుగుణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం చెల్లించాలి

వెదురుకుప్పం: ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు గీత, అంగన్‌వాడీ వర్కర్ల సంఘం కార్యదర్శి లక్ష్మీనరసమ్మ డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం వెదురుకుప్పంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్కీం కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వారి పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం నాటితో ధర్మరాజస్వామి వార్షిక ఉత్సవాలు ముగిశాయి.

శేష వాహనంపై శ్రీరామచంద్రుడి విహారం



శేషవాహనంపై విహరిస్తున్న శ్రీరామచంద్రుడు

తవణంపల్లి: మండలంలోని టి.పుత్తూరులో శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శేష వాహనంపై శ్రీరామచంద్రుడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం ఆలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులు స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఉయ్యాలసేవ నిర్వహించారు. ఉభయదారులు పూజాసామగ్రి, సుగంధ పరిమళ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. పండితులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేయించి నైవేద్యం సమర్పించారు . రాత్రి విద్యుద్దీపాలంకరణ, గజమాలలు, పుష్పాలతో అలంకరించిన శేషవాహనంపై శ్రీరామచంద్రుడు విహరించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం...

కోదండరామాలయంలో గురువారం ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం 4.30 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.